

కథ 1995
4

# వి.డి.ఆర్.యల్.

కుప్పిలి పద్మ

వొకటా... రెండా... నాలుగు నెలల నుంచీ బాధ. తల నొప్పో... గుండెనొప్పో... నడుం నొప్పో అయితే యెవరికైనా చెప్పుకునేది. కాని యిది యెవరికీ చెప్పుకోనిచ్చేట్టు లేదు. శరీరానికి సంబంధించిన రోగమే కదా. అయినా చెప్పుకోలేక పోతోంది. యెవరికైనా చెప్పాలి. యెవరికి?...

ఆలోచిస్తూ డాబాపై వడియాలు ఆరబోస్తున్న నాగమణి, "యింకా కాలేదా?" కింద నుంచి అత్తగారి కేక వినిపించ గానే, "ఆఁ ఆఁ! అయిపోయింది. వచ్చేస్తున్నాను," అంటూ త్వరత్వరగా వడియాలు ఆరబెట్టి ఖాళీ అయిన బేసిన్‌ని పట్టుకుని కిందికి దిగుతూ 'అత్తయ్యకి చెపితే,' అనుకొంది.

"కాస్త ఆ పప్పులుసుకి తిరగమోత పెట్టు. సినిమా వచ్చే వేళయింది," అంటూ వర్ధనమ్మ హాల్లోకి వెళ్లింది.

నాగమణి బేసిన్‌ని అంట్లగిన్నెల్లో పడేసి చేతులు కడుక్కుని పొడి బట్టతో తుడుచుకొంది.

పోపులపెట్టె తీసింది. స్టవ్‌పై కాడ మూకుడు పెట్టి స్టవ్ వెలిగించింది. నూనెపోసి పోపుగింజలు వేసింది. కరివేపాకు వేస్తుంటే ఆకులకి వున్న నీటిచుక్కలు వేడి నూనెకి తగలగానే నూనె తుళ్లి బుగ్గమీద వో చుక్క చేతులమీద కొన్ని చుక్కలు పడ్డాయి. ఆ వేడికి నాగమణి, "అబ్బా," అంది.

"యేమయింది?" టి.వి. స్విచ్ ఆన్‌చేసి సినిమా ఛానల్‌ని ట్యూన్ చేస్తున్న వర్ధనమ్మ అరిచింది.

"ఆ యేం లేదు. నూనె తుళ్లింది," అప్పటికే చర్మపు మంట తగ్గిన నాగమణి తేలిగ్గా అంది.

టి.వి.లో రాజేంద్రప్రసాద్ సినిమా వస్తూంది.

వర్ధనమ్మ నవ్వు మొహంతో సినిమా చూస్తోంది. ఆవిడకి రాజేంద్రప్రసాద్ సినిమాలంటే మహా యిష్టం. యిప్పుడు యీ విషయం చెప్పి ఆమె నవ్వుని యెగరగొట్టడం యెందుకులే అనుకుంది నాగమణి.

అసలు యిలాంటి బాధలు యెవరికైనా వస్తాయా? నాకే వచ్చాయా? అనుకొంటూ యిస్త్రీ చెయ్యాల్సిన బట్టలు కుప్పపోసి ఐరన్ బాక్స్ ప్లగ్ పెట్టి స్విచ్ ఆన్ చేసింది.

శేషగిరి చొక్కాలు యిస్త్రీ చేయడం అవుతుండగా, "అమ్మాయ్ కంచంలో అన్నం పెట్టి యిక్కడికే యిచ్చె. సినిమా చాలా బాగుంది," నాగమణికి వినిపించేలా కేకేసింది వర్ధనమ్మ.

స్విచ్ ఆఫ్ చేసి వంటింట్లోకి వెళ్లింది నాగమణి. నొప్పితో త్వరగా నడవటానికి వీలుకావడంలేదు. నిండా ముసుగుపెట్టి పడుకోవాలని వుంది. వేళకానివేళ నిద్రేంటంటే యేం చెప్పాలి ?

వడ్డించిన కంచం వర్ధనమ్మకి అందించింది. మంచినీళ్లు, పెడుతూ, 'ఇప్పుడు చెపితే?'

"చీరల వాడొచ్చాడు," అంటూ పక్కింటావిడ వచ్చింది.

తినటం పూర్తిచేసి చీరలనీ సినిమానీ మార్చి మార్చి చూసేస్తూంది వర్ధనమ్మ. నాలుగు నెలలుగా పడుతున్న బాధని చెప్పాలంటే ప్రతిసారి యేదో వొక అడ్డే. మొదటిసారి వచ్చినప్పుడు అదే పోతుందిలే అనుకొంది. రెండవసారి వచ్చినప్పుడు చెప్పటానికి మొహమాటం, సిగ్గు. వాటిని పక్కకిపెట్టి చెపుదాం అనుకునే లోగా శేషగిరి వూరు వెళ్లాడు. మూడోసారి వచ్చినప్పుడు యింట్లో చుట్టాలు వున్నారు. యిది నాలుగోసారి యిలా బాధపడటం. యీసారైనా చెప్పటం అవుతుందా?

అత్తగారికి తెలియకపోవటాన్ని అర్థం చేసుకో వచ్చు. బాగా చదువుకున్న శేషగిరి మూర్ఖత్వాన్ని యెలా అర్థం చేసుకోవాలో తెలియడంలేదు నాగమణికి.

నాలుగోరోజు బ్లీడింగ్ అవుతుంటేనే, 'అందరూ మూడురోజులే అంటారుగా! నీకేంటి నాలుగు రోజులు అవుతుంది? యిదేం రోగం? నాకే దొరకాలా యిలాంటి రోగమున్న పెళ్లాం,' కంట్రోల్ చేసుకోలేని శారీరక కోరికలతో శేషగిరి తిట్టే తిట్లు, ప్రతినెలా గుండెని పొడిచే తూట్లు యింకా పచ్చిగా బాధిస్తూనే వున్నాయి. యిప్పుడు యీ విషయం చెపితే యేమంటాడో, యింతకీ యిదే రోగమో? ఆలోచిస్తున్న నాగమణి ముఖం కాకర పువ్వొత్తిలా వెలిగింది.

చప్పున పుస్తకాల షెల్ఫ్ దగ్గరికి వెళ్లింది. లార్జెస్ట్ సర్క్యులేటెడ్ వీక్లీ పాత సంచికలు బయటకి తీసింది. వొక్కో సంచిక అందుకుని అందులో దాంపత్య జీవనం శీర్షిక తీసి, ప్రశ్నలు చదవడం మొదలుపెట్టింది. వొక్కటీ తన జబ్బేంటో చెప్పలేకపోయాయి.

"యింకా పుస్తకాల ముందే వున్నావా? పేరంటానికి వెళ్లాలిగా," మధ్యాహ్నపు నిద్ర నుంచి లేచిన వర్ధనమ్మ అంది.

"ఆ ఆ! అయిపోయింది. వెళతాను," అంటూ ఆ పుస్తకాలు తిరిగి లోపల పెట్టేసి వర్ధనమ్మకి టీ చేసి యిచ్చి గదిలోకి వచ్చింది. బీరువా తీసింది.

పట్టుచీరలు, జరీచీరలు, గార్డెన్, విమల్- మెత్త మెత్తని చీరలు. తను పోతే ముచ్చటైన చీరలన్నీ యెవరు కట్టుకుంటారు? అత్తయ్య యీ చీరలన్నీ వదినగారికి యిచ్చేస్తుందేమో? అమ్మ కొన్న చీరలు కదా, అమ్మకి తిరిగి యిస్తే చెల్లాయికి పనికివస్తాయి కదా!

"యేంటి యింకా అలానే వున్నావా? తయ్యారు కాలే," గద్వాల పట్టుచీర పయిట అంచుల్ని సర్దుకుంటూ వచ్చిన యెదురింటి ప్రమీలని చూసి, "ఆ ఆ అయిపోయింది," అంటూ పట్టుచీరని గబగబా నడుం చుట్టు తిప్పి కుచ్చెళ్లుపోసి కట్టుకుంది. యెన్నెన్ని కళలు. యిదే చీరతో పెళ్లికూతుర్ని చేసి బుగ్గన చుక్క, నుదుట కళ్యాణ తిలకం పండిన గోరింట చేతులు- యేది ఆ అలంకరణంతా! ఆఖరి పేరంటమా? ఛీ ఛీ యేమిటిదంతా యింత బేలతనమా?

కళ్లల్లో వుబుకుతున్న నీటిని ఆపటానికి ప్రయత్నిస్తూ తనని తాను మందలించుకుని ప్రమీల వెంట పేరంటానికి బయలుదేరింది.

యెటు చూసినా కళకళలాడిపోతూంది పేరంటపు యిల్లు. యెంత అదృష్టవంతులు వీళ్లంతా. అలా అనుకోడానికి లేదేమో. తన చీర ధగ ధగలు, తన నవ్వు చూసి తనకి వో చెప్పుకోలేని సమస్య వుందని యెవరైనా అనుకుంటారా?

చీరెంత ట్రాన్స్‌పరెంట్ అయినా గుండెలో విషాదాన్ని చూపించదు కదా!

పేరంటం నుంచి యింటికి వచ్చింది. అత్తగారు అడిగిన పేరంటం విశేషాలన్నీ ముక్తసరిగా యేకరువు పెట్టింది.

అప్పటికి శేషగిరి యింటికి వచ్చి స్నానంచేసి గాంధీచౌక్ వరకు వెళ్లి స్నేహితులతో కబుర్లు ముగించుకొని వచ్చాడు. అతనికి వడ్డించింది. అతను తిని గదిలోకి వెళ్లి పక్క మీద వాలిపోయాడు. వంటిల్లు చక్కబెట్టుకుని నాగమణి గదిలోకి వెళ్లి పక్కపై వాలింది.

రకరకాల ఆలోచనలతో ఆమెకి నిద్రపట్టలేదు. సుగుణ పెళ్లి అయ్యాక వెళ్లిపోతుంది కదా. అప్పుడు చెపితే సరి. యిప్పుడు శేషగిరికి చెప్పినా, అత్తయ్యకి చెప్పినా యీ విషయం సుగుణకి తెలిసిపోతుంది. సుగుణ మరో యిద్దరికి చెపుతుంది. వాళ్లు మరొకరికి- యింత గొడవ యెందుకు? నాలుగు రోజులు వోపిక పడితే... లాభంలేదు. నాలుగురోజుల్లో పిరియడ్స్ వస్తాయి. యీ రోగమేంటో తెలుసుకోవాలంటే తిరిగి నెల్లాళ్లు ఆగాలి. అప్పుడు యింట్లో యెవరుంటారో... నాగమణి వులిక్కి పడింది. వంటిపై శేషగిరి చెయ్యి పడగానే చేతిని పక్కకి తప్పించింది. నిద్రలో తప్పించిందనుకుని మళ్లీ వేశాడు. తిరిగి పక్కకి దూరంగా జరిగింది.

"యేం?" అడిగాడు.

"వీలుకాదు."

"అప్పుడేనా? అప్పుడే పీరియడ్సా?"

"కాదు."

"మరి?"

"అది కాదు"... నాగమణి ఆగిపోయింది.

"యేంటో చెప్పరాదా...వెధవ నీలుగు."

చెప్పేస్తే..? సంస్కారయుతంగా చెప్పాలని పదాల వెతుకులాట. కళ్లు, ముక్కు, నోరులా అన్ని అవయవాల్లా అవయవమే అయినా మర్యాదస్తులకు నిషిద్ధ పదం కదా... యెలా చెప్పాలి... చెపితే యేమంటాడో!

"పీరియడ్స్‌కి నాలుగురోజుల ముందు అక్కడ యేదో వొక భాగంలో వుసిరికాయంత గడ్డ వస్తుంది, సెగ్గడ్డలా. ముందురోజు యే నొప్పి వుండదు. రెండో రోజు నొప్పి మొదలు, మూడోరోజు బాగా వుంటుంది. నాలుగోరోజో ఐదోరోజో పగిలిపోతుంది. నెత్తురు మాత్రం కారుతుంది. నెత్తురు గడ్డలా వుంటుందను

కోండి. అంతే తిరిగి యే నొప్పి వుండదు. ప్రతి నెలా ఒకేచోట కాదు, అక్కడే యెక్కడో వొకచోట వస్తుంది,'' గబగబా చెప్పేసి వూపిరి పీల్చుకుంది నాగమణి.

అంతా విని పడుకున్నవాడు కాస్త లేచి నిటారుగా కూర్చుంటూ, ''సంసారులకి వచ్చే రోగాలేనా యివి! బజారు ఆడాళ్లలా యీ రోగాలేంటి, పిల్లలు అందుకే పుట్టడం లేదనుకుంటా ఛీ! పాడురోగాలన్నీ వున్నాయా? అవ్వా! మా యింటా, వంటా లేవు యిలాంటివి,'' అనేశాడు.

నాగమణి మనసులో బ్లో ఔట్ మంటల్లా చివ్వున బాధ చిమ్మింది.

యీ బాధ మొదలై నాలుగు నెలలు అయినా చెప్పలేదు. చెప్పకపోవడానికి వున్నన్ని భయాలని నిజం చేస్తూ అనాల్సిన మాటలన్నీ నిర్మొహమాటంగా అనేశాడు. బజారు ఆడాళ్లంట! వాళ్లూ మనుష్యులే కదా... ఆడవాళ్ల గురించి శేషగిరి యింతకంటే సంస్కారయుతంగా మాట్లాడగలడనుకోవడం తన తెలివి తక్కువతనం. యింటా వంటా ఇలాంటివి వున్నాయో లేవో తెలియటానికి యీ యింటి ఆడవాళ్లని యెప్పుడైనా నోరు విప్పనిచ్చారా?

''రేపు యెవరైనా డాక్టర్ దగ్గరికి నువ్వే పో, నీతో వస్తే పరువుపోతుంది,'' విసుక్కున్నాడు శేషగిరి.

తిమింగలం నోట చిక్కిన మానవశరీరంలా గిలగిలా కొట్టుకుంటోంది నాగమణి హృదయం.

సంసారులకి వచ్చే రోగమా! అంటే తనేం చేసిందని? నాగమణి ముఖాన్ని తలగడకి రుద్ది గట్టి ప్రయత్నం చేసింది దుఃఖాన్ని ఆపుకోడానికి. హృదయపు బాధ కంటిపాప ప్రవాహమైంది.

మర్నాడు వుదయం యాభై రూపాయిల నోట్లు రెండు మంచంపై గిరాటువేసి, ''యేదో వొక డాక్టరుకి చూపించుకో. తెలిసిన డాక్టర్ల దగ్గరికి వెళ్లొద్దు. నా పరువుపోతుంది,'' అన్నాడు.

యే డాక్టర్ దగ్గరికి వెళ్లాలి?

యీ వూర్లో వున్న చాలామంది డాక్టర్లతో శేషగిరికి పరిచయం వుంది. బ్యాంక్ ఆఫీసరుగారి భార్య కావటమూ కష్టమేలా వుంది. అతగాని పరువు పోతుందంట. టెన్నీస్‌కోర్టు పరిచయాలు. క్లబ్‌లో పేకాట పరిచయాలు. బ్యాంక్ అకౌంట్‌లు సేఫ్ డిపాజిట్ లాకర్లు- వొక్క పరిచయమా, వొక్కగోలా... యే డాక్టర్ దగ్గరికి వెళ్లాలి.

సెక్స్ స్పెషలిస్ట్?! అవునూ యెప్పుడన్నా యెక్కడన్నా లేడీ సెక్స్ స్పెషలిస్ట్ అని బోర్డు చూశామా? మగవాళ్లకి వీధికో స్పెషలిస్ట్. అంటే ఆడవాళ్లకి ఇలాంటి జబ్బులు రావనా? వచ్చినా పైకి చెప్పుకోకూడదనా? మగవాళ్లకి యేమొచ్చినా ఆమోదయోగ్యమే. చెప్పుకోవచ్చు. చూపించుకోవచ్చు. ఆడవాళ్లదంతా గోప్యం... స్త్రీలు భావిభారత పౌరులని తీర్చిదిద్దే దేవతామూర్తులు అనే ప్రభుత్వ యంత్రాంగం స్త్రీల ఆరోగ్యకేంద్రాలని యమకూపాలుగానే నిర్వహిస్తుంది కదా!

పెద్ద పేరులేని చిన్న క్లినిక్‌కి వెళితేసరి, యే క్లినిక్?

''యేం చేస్తున్నావ్,'' అడిగింది ఆరోజు వండిన గుత్తివంకాయ కూర తీసుకొని వచ్చిన ప్రమీల.

ప్రమీలకు చెపితే? పెళ్లయి యీ యింటికి వచ్చినప్పట్నుంచి ప్రమీలతో పరిచయం. యిద్దరూ కలసి గుడికి వెళతారు. నోములు నోచు కుంటారు. షాపింగ్ చేస్తారు. చీరల ఫాల్స్ కుట్టిపెట్టుకుంటారు. మొగుళ్ల యెత్తిపొడువులు, సాధింపులు చర్చించుకుంటారు. యింటి విషయాలు మాట్లాడుకుంటారు. రెండు రోజులు ప్రమీల వూరు వెళ్లినా, తను వెళ్లినా, యిద్దరికీ తోచదు. పరిచయం స్నేహంగా మారిపోవటానికి యెక్కువ సమయం పట్టనేలేదు. ప్రమీలకి చెపితే ?

''డాక్టర్ దగ్గరికి వెళ్లాలి ప్రమీలా.''

''యే డాక్టర్ దగ్గరికి ? యేయ్ దొంగా యేంటి విశేషమా?'' వుత్సాహంగా అడిగింది ప్రమీల.

''కాదు.''

''మరి?''

నాగమణి కాసేపు మౌనంగా మెల్లగా అక్షరాలు కూడబలుక్కున్నట్టు, ''సెగగడ్డల్లా వస్తున్నాయి, చూపించుకోవాలి,'' అంది.

నాగమణి చెప్పిన తీరు ప్రమీలకి అవి యెక్కడ వస్తున్నాయో అర్థం అయిపోయింది.

ప్రమీల వొక్క నిమిషం తటపటాయించి, ''యింట్లో చెప్పావా,'' అడిగింది.

''ఆయనతో చెప్పాను. అత్తయ్యగారికి యింకా చెప్పలేదు,'' అంది నాగమణి.

''అలాగా! ఆయనని తీసుకువెళ్లమనకపోయావా?''

''ఆయన్నా? అంతా తెలిసిన డాక్టర్లేనట, పరువు పోతుందంట,'' అంటూ శేషగిరి అన్నమాటలు చెప్పింది.

''గుట్టల బజారులో హెల్త్ పాలిక్లినిక్ వుంది. అక్కడికి వెళ్లు,'' అంది ప్రమీల.

''నువ్వు రావా,'' అడిగింది నాగమణి.

''నాకు యెక్కడ వీలవుతుంది చెప్పు. అదీకాక ఆ డాక్టరమ్మకి మా పిన్నిగారు తెలుసు,'' అంది ప్రమీల.

యిటువంటి పేషెంట్‌తో వెళితే తన పరువుకి భంగమని, తనని యెవరైనా యేమైనా అంటారని ప్రమీల భయం.

"సరే," అంది నాగమణి.

డాక్టర్ దగ్గరికి వెళ్లాలని నిశ్చయించుకుంది. కాని యింట్లోంచి యెలా బయటపడాలో నాగమణికి అర్థం కాలేదు. అత్తగారు యింట్లోనే వుంది. త్వరత్వరగా పని పూర్తి చేసేసుకుని, "గాంధీచౌక్ వెళుతున్నాను. పెళ్లిలో కట్టుకున్న పట్టుచీర మీద జాకెట్ బాగా పాతదైపోయింది. యింకోటి తెచ్చుకోవాలి. మీ అబ్బాయికి చెప్పాను," గబగబా అనేసింది నాగమణి.

'యిప్పుడు యెందుకు,' అని అత్తగారు యెక్కడ అంటుందోనని శేషగిరి పర్మిషన్ కూడా వుందనే విషయమూ వినిపించేసింది. అనవసరం అనుకుంటే శేషగిరి పర్మిషన్ యివ్వడని వర్ధనమ్మగారికి బాగా తెలుసు.

"సరే వెళ్లు," అందామె సినిమా ఛానల్ పెడుతూ.

"త్వరగా వచ్చేస్తాను," అంటూ గుమ్మం దాటింది నాగమణి. అప్పుడే గుర్తొచ్చి, "ప్రమీలని తోడు తీసుకు పోరాదూ," కేకేసింది వర్ధనమ్మ.

"ప్రమీలకి యింట్లో పని కాలేదంట," అనేసి నొప్పిని పట్టించుకో కుండా త్వరత్వరగా రోడ్డు మీదకి అడుగులు వేసింది నాగమణి. కొంచెం దూరం నడవగానే రిక్షా దొరికింది. క్లినిక్ ముందు దిగి యేభై రూపాయల నోటు అందించింది.

"చిల్లర లేదమ్మా," అన్నాడు.

నాలుగు దుకాణాలు తిరిగి చిల్లర తీసుకొంది. రిక్షా అతనికి డబ్బులిచ్చి క్లినిక్ గేటు దాటి లోపలికి వెళ్లింది. గైనకాలజిస్ట్ అని బోర్డున్న గదిముందు బల్లలపై నెలలు నిండినవాళ్లు, నిండుతున్నవాళ్లు, చిన్ని చిన్ని పొట్టలు వున్నవాళ్లు, లేనివాళ్లు, గర్భసంచి తీయించుకోబోయేవాళ్లు- పాలిపోయిన శరీరాలతో కూర్చుని వున్నారు.

వీళ్లని చూసినవాళ్లు యెవరైనా మూడు రాత్రుల మాధుర్యం అంటూ కలలు కనగలరా? వూహలు అల్లుకోగలరా?

నర్సు వచ్చిన వాళ్ల పేరు, వివరాలు పరపరా రాసి పారేస్తోంది.

"పేరు?"

యే పేరు చెప్పాలి? నిజం చెపితే యేమవుతుంది? యేంకాదు. నాగమణి పేరు వొక్క శేషగిరి భార్యకే వుంటుందా? శేషగిరి చాలామందికి తెలుసు. కాని తాను అందరికీ తెలియదుగా.

"నాగమణి."

"వయసు్స?"

"యిరవై."

"పెళ్లయి యెన్నాళ్లయింది?"

"సంవత్సరం."

"లాస్ట్ పీరియడ్స్ డేట్?"

"మార్చి 20."

"యింకా నెలైనా కాలేదుగా అప్పుడే యేంటి కంగారు?"

"ప్రెగ్నెన్సీ డౌట్ కాదు."

"మరింకేంటి?"

"డాక్టర్‌గారితో మాట్లాడాలి."

ఆవిడ నాగమణిని యెగాదిగా చూసింది. మట్టెలు, నల్లపూసలు వున్నాయి. పెళ్లి అయినట్టే వుంది. రహస్యపు అబార్షన్ గొడవ కాదు. నెల తప్పలేదంటుంది గర్భసంచి తీసే వయసూ్స కాదు. యింకేం జబ్బు?

"నెక్స్ట్," విసుగ్గా అరిచింది నర్సు.

నాగమణి ఆ స్త్రీల పక్కన వో బల్లపై కూర్చుంది. నిస్తేజంగా కదులుతున్నాయి శరీరాలు డాక్టరమ్మ గదిలోకి. అంతే నీర్సంగా బయటికి కాళ్లు యీడ్చుకుంటూ వస్తున్నారు.

నాగమణి వంతు వచ్చింది. లోపలికి వెళ్లింది. డాక్టరమ్మని చూడగానే నాగమణికి కాస్త ధైర్యం వచ్చింది. డాక్టరమ్మకి తన రోగం గురించి యెలా చెప్పాలని ఆలోచించిందంతా గాలికి కొట్టుకుపోయింది. చెప్పాల్సింది చెప్పేసింది తలదించుకుని.

బల్లపై పడుకోమంది డాక్టరమ్మ.

"వొకసారి అన్ని పరీక్షలు చేద్దాం, రిపోర్ట్స్ చూశాక మందులు రాస్తాను. మీవారికి యెలాంటి కంప్లైంట్స్ లేవా?" అడిగింది డాక్టరమ్మ.

"యేం చెప్పలేదు."

"అడగండి. ఆయనకి యేమైనా ప్రాబ్లమ్ వుంటే వొకసారి డాక్టర్‌కి చూపించుకోమనండి." అందామె.

ముప్పై రూపాయలు డాక్టరమ్మ ఫీజ్ యిచ్చి నాగమణి బయటికి వచ్చింది. నర్సు దగ్గరికి టెస్ట్‌లు యెక్కడ చేయించుకోవాలని అడిగింది.

"యిక్కడే, యేవీ యిటు యివ్వండి. బిల్ రాస్తాను," అందామె. నాగమణి చీటీ అందించింది. నర్సు చీటీ తెరిచి చూసింది.

వి.డి.ఆర్.ఎల్.

నాగమణి వేపు అదోలా చూస్తూ నలభై అంది.

నాగమణి యాభై రూపాయల నోటు అందించింది. నర్సు పక్కనున్న మరో నర్సుకి ఆ చీటీని యిచ్చింది. యిద్దరూ చీటీని చూసి వొకరి ముఖాలని వొకరు చూసుకొని మెల్లగా చెవులు కొరుక్కుంటున్నారు. వాళ్లకి యిటువంటి టెస్ట్‌లు చేయించుకునే లేడీ పెషేంట్స్ చాలాచాలా తక్కువ.

"రా," బిల్ రాయటం పూర్తయిన నర్సు అంది. నర్సు తిరిగి పదిరూపాయలు యివ్వలేదు. వాళ్ల చూపులు, మాటలకి సిగ్గుతో గొంతు పూడుకుపోయిన నాగమణికి ఆ డబ్బులు అడగడానికి నోరు పెగలలేదు. శేషగిరికి ప్రతి పైసా లెక్క చెప్పాలి. యీ పది రూపాయల గురించి యేం చెప్పాలి, యెన్ని చివాట్లు తినాలో నని ఆలోచిస్తూ 'నర్సుకి యివ్వాలి కదా, మామూలంటే' అనుకొంటూ అయినా చివాట్లు తప్పవని బెంగపడుతున్నా నర్సుని ఆ డబ్బులు గురించి అడగటానికి మాత్రం సాహసించలేకపోయింది. నర్సు వెంట లేబరేటరీలోకి వెళ్లింది.

ఆ లాబ్‌ని చూస్తేనే కడుపులో దేవినట్టయింది. యెటు చూసినా మురికి, అశుభ్రం, సలసలా మరుగుతున్న నీటిలో సిరెంజిలు చూస్తుంటే నాగమణికి భయం వేసింది.

"డిస్పోజబుల్ సిరెంజ్‌లు వాడరా," మెల్లగా అడిగింది.

"యిదంత పెద్ద ఆసుపత్రి కాదు. డబ్బులు యెక్కువుంటే నీకు డిస్పోజబుల్ సిరెంజ్‌లు వాడతాం," అంది నర్సు.

"యిస్తారు. యెంత?"

"పది రూపాయలు."

అంత ఖరీదా! అనుకుంటూ, 'పది రూపాయలు వున్నాయి కదా మీ దగ్గరా,' అనబోయి, నర్సు చూపుల బాధ యింకా పచ్చిగా వుండడంతో నాగమణి ఆ డబ్బు విషయం మాట్లాడకుండా మళ్లీ డబ్బులు తీసి ఇచ్చింది.

బండ సూదిని రక్తం తీసుకోడానికి నరంలోకి సర్రున దింపింది నర్సు.

కెవ్వుమంది నాగమణి.

"యెందుకలా అరుస్తున్నావ్."

"నొప్పి."

"అప్పుడు తెలియదా నొప్పి, కదలక. నీకు యీ టెస్ట్ చాలా అవసరం," కోపమో, జాలో అర్థంకాని రీతిలో కసిరింది నర్సు.

నాగమణి చేతిలో నరం దొరకలేదు. సూదిని బయటికి లాగి, "పిడికిలి బిగించు," అంది నర్సు.

"మళ్లీనా," భయంగా అడిగింది నాగమణి.

"టెస్టుకి వచ్చినప్పుడు వున్న భయం ఆరోగ్యం పట్ల వుండాలి," అంటూ మళ్లీ సర్రున సూది దింపి రక్తాన్ని తీసింది.

నాగమణి బుగ్గల్లోంచి వెచ్చని ఆవిర్లు. వేలవేల సూదులు శరీరంలో గుచ్చి రక్తాన్నంతా తోడేసినట్లు నిస్త్రాణగా అయిపోతున్న శరీరంతో బయటికి వచ్చింది.

యెందుకొచ్చింది యీ యిన్‌ఫెక్షన్? యెలా వచ్చింది? శేషగిరి తప్ప మరో మగవాడు తెలియదు కదా! కాని యెలాంటి చూపులు, యెంతెంత అసహ్యం!

'డాక్టర్ దగ్గరికి వెళ్లావా,' అని శేషగిరి అడగలేదు. ఆ రాత్రి యింటి పని ముగించుకుని గదిలోకి నాగమణి వచ్చేసరికి శేషగిరి మంచంపై పడుకొని తెలుగు వార పత్రికలోని శృంగార కథ చదువుతున్నాడు. అతను యేం అడగకపోయినా చెప్పటం తన బాధ్యత అనుకొని, "గుట్టలజజారులో వున్న పాలిక్లినిక్‌కి వెళ్లాను. బ్లడ్ శాంపిల్ యిచ్చివచ్చాను. రేపు వెళ్లాలి," అంది నాగమణి.

శేషగిరి పుస్తకంలోంచి తల తిప్పలేదు. వూ, ఆ అనలేదు.

అతని పట్టించుకోనితనం గుండెలని ముల్లులా గుచ్చుతున్నా, "మీకు యిటువంటి బాధలు యేమైనా వున్నాయా? వుంటే డాక్టర్ టెస్ట్‌లు చేయించుకోమన్నారు," అంది.

"ఛీ... ఛీ... యింటావంటా లేని చీడంతా నువ్వు పట్టుకొచ్చి తిరిగి నాకు వున్నాయేమోనని అడుగుతున్నావా? మతుండే మాట్లాడుతున్నావా? నాకేం రోగం లేనప్పుడు నీకు రోగం యెలా వచ్చింది? యెక్కడ నుంచి వచ్చింది. నువ్వు చెప్పినప్పటి నుంచి అదే ఆలోచిస్తున్నా. యింకా యెక్కువ ఆలోచిస్తే నేనేం అయిపోతానో నాకే తెలియదు. యేం రోగమో యేమో వేరే పడుకో," యెడాపెడా అనేశాడు శేషగిరి.

నాగమణి సిగ్గుతో అవమానంతో కుంగిపోయింది.

మర్నాడు అత్తగారికి మరో నాలుగు అబద్ధాలు చెప్పి డాక్టర్ దగ్గరికి బయలుదేరింది.

నర్సుని అడిగి రిపోర్ట్ కవర్ తీసుకొని తన వంతు రాగానే డాక్టర్ గదిలోకి వెళ్లింది. కవర్ డాక్టర్‌కి అందించి తలొంచుకొని ముడుచుకుపోయిన మనసుతో కూర్చుంది.

డాక్టర్‌గారు కవర్‌లోంచి కాగితం తీసి చూసి, "నెగిటివ్ రిపోర్ట్, సో అటువంటి డిసీస్ యేంకాదు. మందులు రాసి యిస్తాను. వాడండి. తగ్గిపోతుంది. తగ్గకపోతే తిరిగి ఆలోచిస్తాను," అన్నారు.

నాగమణి తలెత్తింది. తేటపడిన కళ్లు, స్పష్టమైన స్వరంతో, "యెందుకొచ్చినట్టు," ప్రశ్నించింది.

"చిన్న యిన్‌ఫెక్షన్ అయి వుంటుంది. మెన్సస్ అప్పుడు వాడే క్లాత్ కావొచ్చు. యిది వాడి చూద్దాం," అన్నారామె.

"థాంక్యూ," అంటు నాగమణి గదిలోంచి బయటికి వస్తుంటే నర్సు కనిపించింది కౌంటర్ దగ్గర.

"నిన్న మీరు పది రూపాయలు యివ్వాలి. యిస్తారా," జీవమున్న స్వరంతో నర్సుని అడిగింది నాగమణి.

"నిన్నా," గుర్తున్నా లేనట్టే అడిగింది నర్సు.

"అవునండి,"

నర్సు యేం అనలేక డబ్బులు యిచ్చింది.

నాగమణి మందులు కొనుక్కుని యింటికి వచ్చింది. అత్తగారి కళ్లలో పడకుండా మందులు లోపల పెట్టింది. తనది గోప్యంగా వుంచాల్సిన రోగం కాక పోయినా యిన్ని రోజులు చెప్పలేదు కదా. అత్తగారు యేమైనా అంటారని నాగమణి భయం.

నాగమణి సాయంత్రం స్నానం చేసి నేతచీర కట్టుకొని పువ్వులు పెట్టుకొంది. గుండెల్లో బరువు దిగి పోవటంతో హుషారుగా కూనిరాగాలు తీస్తూ పనులు చేసుకొంటు శేషగిరి కోసం యెదురుచూస్తోంది.

శేషగిరి వచ్చాడు. స్నానంచేశాడు. అన్నం తిన్నాడు. టి.వి. ముందు కూర్చున్నాడు. శేషగిరికి యెప్పుడు తన విషయం చెపుదామాని నాగమణి ఆత్రుతగా యెదురు చూస్తోంది. టి.వి. ఆపి శేషగిరి గదిలోకి వచ్చాడు. మంచంపై పడుకుంటూ చేతికి అందిన పుస్తకం తీసు కున్నాడు.

నాగమణి మంచం చివర కూర్చుంటూ, "డాక్టర్ దగ్గరికి వెళ్లాను కదా. బ్లడ్ టెస్ట్ చేశారుగా, యేం లేదంట," అంది.

శేషగిరి 'వూ, ఆ' అనలేదు.

"వింటున్నారా," తిరిగి అడిగింది నాగమణి

"ఆ వింటున్నా? నువ్వా విను. నీకీ రోగం యెక్కడ నుంచి వచ్చింది. యెవడు వాడు?"

నాగమణికి శేషగిరి ప్రశ్న అర్థం అవుతూనే గుండెని మంచు కత్తితో కోసినట్టు మనసంతా మొద్దు బారిపోయింది.

"నాకా?.... యె...వ్వరితో యేంలేదు అయినా... అయినా నాకేం లేదని డాక్టర్ చెప్పారుగా. కావలిస్తే రిపోర్ట్ చూడండి," నోరు తడి ఆరిపోతుంటే మెల్లగా అంది.

"యెవ్వడికి కావాలి ఆ రిపోర్ట్, నువ్వు వో రోగాల పుట్టవి. అందుకే నీకు పిల్లలు పుట్టలేదు. నమ్మించాలని ప్రయత్నించకు. నీ ముఖం చూపించకు. నన్ను రెచ్చ గొట్టకు. నీకు నాకు యే సంబంధం లేదు. పో యిక్కడ నుంచి," అన్నాడు శేషగిరి.

నాగమణి మెల్లగా తేరుకుంటూ "డైవోర్సా?" అంది.

"యేంటి? డైవోర్సా? యింకా ఆ మోజు తీరాలా? నువ్వు నన్నేం అడగొద్దు. నీకు నాకు యే సంబంధం లేదు. యెలా చెప్పాలో యేం చెయ్యాలో నాకు తెలుసు. నోరుమూసుకో," కసిరాడు శేషగిరి.

"యిందులో నా తప్పేం వుంది. నాకు మీరు తప్ప మరెవ్వరూ తెలియదు. నాకే రోగం లేదని డాక్టర్ చెప్పారుగా! యింకా మీ అనుమానం యేంటి?" నిల దీసింది నాగమణి.

"యేంలేదా? లేకపోతే నీకు వున్న రోగం యేంటి? పైగా అరుస్తున్నావ్," చికాకుపడ్డాడు శేషగిరి.

'శరీరంలో యే భాగంలో నొప్పి వచ్చినా యెంతో కొంత ఆదరం, కనికరం, కన్సిడరేషన్. కాని ఆ భాగంలో అస్వస్థత రాగానే యేకాకిగా నిలబడాల్సి వచ్చిందే. యిదే శేషగిరికి వస్తే? డాక్టర్ దగ్గరికి వెళ్లడానికి అంత సిగ్గు పడేవాడా? అతనితో అతని స్నేహితులు తన స్నేహితు రాలిలా ప్రవర్తించేవారా? కన్నతల్లికి కూడా చెప్పలేక తనలాగ కుమిలిపోయేవాడా? అసలు యింత వ్యథని అనుభవించేవాడా? అందరి విషయం వదిలేస్తే అతని తో యిలాగే తను ప్రవర్తించేదా? వొక్క మాటైనా అని వుండేదా? తన శరీరాన్ని అతనికి అప్పగించకుండా వుండేదా? అతను మగవాడు కదా. అన్నీ చెల్లుతాయి. తను స్త్రీ కదా. పుట్టటం, పెరగటం, పెళ్లి, శోభనం, పిల్లలు, ఆరోగ్యం, విడాకులు- యేమైనా యే విషయ మైనా తప్పని వొంటరిపోరాటం... యెస్. తనూ పోరాడు తుంది,' రెప్పలార్ప కుండా శేషగిరిని చూస్తూ అనుకొంది నాగమణి.

*ఆంధ్రజ్యోతి వారపత్రిక, 19 మే 1995*

